క్లుప్తంగా

టీజీటీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

జూలూరుపాడు: తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీజీటీటీఎఫ్) నూతన మండల కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జూలూరుపాడులో నిర్వహించారు. టీజీటీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వీరన్న అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం మండల అధ్యక్షుడిగా మాలోత్ లక్ష్మణ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా హలావత్ నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్యా రాంబాబు, కోశాధికారిగా బానోత్ మోహన్, ఉపాధ్యక్షుడిగా బానోత్ నెహ్రూ, బానోత్ కృష్ణ, ధర్మసోత్ నరసింహారావు, అజ్మీర భిక్షం, బోడా కృష్ణ, జె.లఘుపతి, కార్యదర్శిగా శంకర్, మండల మహిళా అధ్యక్షురాలిగా ధరావత్ స్వరూపరాణి, కార్యదర్శిగా భూక్యా రంగమ్మలను ఎన్నుకున్నారు.

రెజ్లింగ్ పోటీలో 'ఏకలవ్య' విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులు

టేకులపల్లి: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో జరిగిన రెజ్లింగ్ చాంపియన్ షిప్ 2025 పోటీలో టేకులపల్లి ఏకలవ్య విద్యార్థులు నాలుగు బంగారు, నాలుగు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ నిశాంత్ కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వాస్పత్రికి నాణ్యమైన విద్యుత్ సరఫరా



ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుక్రవారం 11 కేవీ ఫీడర్‌ను విద్యుత్ ఎస్ఈ జి.మహేందర్ ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రికి నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏడీఈ పి.హేమచంద్రబాబు, ఏఈ ఎం.నర్మద, సిబ్బంది పాల్గొన్నారు.

ఓసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు

సింగరేణి(కొత్తగూడెం): వీకే ఓసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి 10వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ఏరియా బ్రాంచి కార్యదర్శి వి.మల్లికార్జున్‌రావు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపెన్‌కాస్ట్ గనిలో ఓవర్ బర్డెన్ తప్ప ఇతర అన్నిపనులు కంపెనీ నిర్వహించాలని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రైవేట్ వారికి ఇస్తే కాంట్రాక్టర్లకు మాత్రమే లాభసాటిగా ఉంటుందన్నారు. 3వ తేదీన జీకే ఓసీ, ఏరియా స్టోర్స్, 4న పీవీకే–5 ఇంక్లైన్ గని, 5న ఆర్‌సీహెచ్‌సీలో, 6న వీకే వర్క్‌షాపులో, 7న ఎస్అండ్‌పీసీ, సివిల్ విభాగంలో, 10న జీఎం కార్యాలయంలో వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. అప్పటికీ యాజమాన్యం దిగి రాకపోతే, ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి

పాల్వంచరూరల్: రానున్న వేసవికాలంలో మండలంలోని ఏజెన్సీ గ్రామపంచాయతీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయని పంపుసెట్లు, బోర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. విద్యుత్ వినియోగం పెరుగుతున్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రైతుల సాగుచేసిన పంటలకు విద్యుత్ సరఫరాలో సమస్య వచ్చినప్పుడు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న సీసీ రోడ్ల పనులు మార్చి 15 నాటికి పూర్తి చేసి, నెలాఖరులో బిల్లులు చెల్లించాలన్నారు. ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఏఓ శంకర్, సీడీపీఓ, ఏపీఓ, ఏఈలు పాల్గొన్నారు.

సర్వం ఆధ్యాత్మికం..

నేటి నుంచి మార్చి 9 వరకు జాతరలు, ఆలయాల్లో కల్యాణ వేడుకలు



పెద్దమ్మతల్లి ఆలయం (ఇన్‌సెట్) పూజారి సీతారామస్వామి

టేకులపల్లి: ఈ నెల 22 నుంచి మార్చి 9 వరకు టేకులపల్లి మండలంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. ఎక్కడ చూసినా భక్తి పారవశ్యం, పూజలు, జాతరలు, సంబురాలే కనిపించనున్నాయి. టేకులపల్లి మండలంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.

ఇప్పలతండాలో లింగబసవేశ్వర స్వామి జాతర..
టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ ఇప్పలతండాలో కొలువుదీరిన లింగబసవేశ్వ స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి జరిగే జాతర వివరాలను పూజారులు బానోతు శ్రీను, జర్పుల మంగమ్మ శుక్రవారం తెలిపారు. శనివారం రాత్రి 8 గంటలకు శివ పార్వతుల కళ్యాణం, 23న రాత్రి 10 గంటలకు అగ్నిగుండం, సోమవారం ఉదయం 5 గంటలకు స్వామివారి ఊరేగింపు, ప్రత్యేక పూజలు, మొక్కులు ఉంటాయని పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లి జాతర..
టేకులపల్లి మండలం బద్దుతండా పంచాయతీ సీతారామ గుట్టపై వెలిసిన పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 22 నుంచి పెద్దమ్మతల్లి జాతర వేడుకలు జరగనున్నాయని ఆలయ పూజారి భూక్యా సీతారామస్వామి తెలిపారు. 22న ఉయదం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తిరుపతి వెంకన్న పూజలు, తెల్లవారుజాము 2 గంటల వరకు పెద్దమ్మతల్లి హోమం, 23న ఉదయం 7 గంటల నుంచి రథయాత్ర, అమ్మవారు గుడిలోకి ప్రవేశం, ప్రత్యేక పూజలు, మొక్కులు, 26 వరకు జాతర జరుగుతుందని పేర్కొన్నారు.

కొండెంగులబోడు వీరభద్ర ఆలయంలో..
టేకులపల్లి మండలం మద్రాస్‌తండా పంచాయతీ కొండెంగులబోడు గుట్టపై వెలిసిన వీరభద్ర స్వామి భద్రకాళి ఆలయంలో ఈనెల 25 నుంచి స్వామి వారి కళ్యాణం, జాతర మహోత్సవం జరగనుందని ఆలయ పూజారి కేళోతు శంకర్ తెలిపారు. 25న అంకురార్పణ, 26న అర్ధరాత్రి మహాశివరాత్రి వేడుకలు, స్వామి కల్యాణం, మార్చి 3న రథోత్సవం, 4న ఎడ్లబండ్ల ఊరేగింపు, పూర్ణాహుతి, ధూపోత్సవం, 5న వసంతోత్సవం, నాగావళి, 12న 16 రోజుల పండుగ వేడుకలు జరుగుతాయని తెలిపారు.

సిద్ధారంలో కళ్యాణ వేడుకలు..
టేకులపల్లి మండలం గంగారం పంచాయతీ సిద్ధారం నందులగుట్ట అడవిలో వెలిసిన సోమలింగేశ్వర స్వామి ఆలయంలో మార్చి 26 నుంచి కళ్యాణ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. 26న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, అభిషేకాలు, రాత్రి 9.15 గంటలకు శివ పార్వతుల కళ్యాణం, 27న ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని వెల్లడించారు.

సంపత్‌నగర్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణం..
టేకులపల్లి మండలం గంగారం పంచాయతీ సంపత్‌నగర్‌లోని కొండపై వెలిసిన వేంకటేశ్వరస్వామి కళ్యాణ వేడుకలు మార్చి 8 నుంచి అంగరంగ వైభవంగా జరగనున్నాయని యాజ్ఞికులు తెలిపారు. 8న అభిషేకాలు, స్వామి వారి అలంకరణ, పెండ్లి కొడుకును చేయడం నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాదగోష్టి, 9న సుప్రభాత సేవ, యాగశాల అర్చన, స్వామి వారి కళ్యాణ మండప ప్రవేశం, కళ్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం



మాట్లాడుతున్న బాలరాజు

ఇల్లెందు: మార్క్సిజం అజేయమైందని, పెట్టుబడిదారి విధానానికి విరుగుడు కమ్యూనిజమేనని సీపీఎం జిల్లా నాయకుడు లిక్కి బాలరాజు అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని ఏలూరి భవన్‌లో సీపీఎం ఇల్లెందు, టేకులపల్లి మండలాల సంయుక్త కమిటీ సమావేశం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ అధ్యక్షతన జరిగింది. బాలరాజు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు భిన్నంగా మనదేశంలో పెట్టుబడిదారి వ్యవస్థ ఫాసిస్టు తరహాలో కార్పొరేట్‌కు అనుకూలంగా మితవాద బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర సంఘటన ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వచ్చే ఏప్రిల్ మొదటివారంలో సీపీఎం ఆలిండియా మహాసభ మధురైలో జరుగుతుందని, అంతర్జాతీయ పరిస్థితులు మీద చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏ నబీ, ఈసం నర్సింహారావు, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, మాదారపు వెంకటేశ్వర్లు, మరియా, మహమూద్, పద్మ, కాంత, నాగరాజు, సత్యనారాయణ కోరీ, రమేష్, మమత, భద్రు, బాబు, వీరయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారం సాధించుకుందాం..



మాట్లాడుతున్న పురుషోత్తం పటేల్

పాల్వంచ: రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం సాధించేందుకు కృషి చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్‌ను గెలిపించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అఫెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుట్టం పురుషోత్తం పటేల్ అన్నారు. శుక్రవారం స్థానిక నటరాజ్ సెంటర్‌లో తెలంగాణ మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ పటేల్ అధ్యక్షతన పట్టణ, మండల మున్నూరు కాపు సంఘం సమావేశం నిర్వహించారు. పురుషోత్తం పటేల్ మాట్లాడుతూ... త్వరలో జరగనున్న టీచర్స్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులందరూ పూల రవీందర్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బత్తుల సిద్దేశ్వర్, పర్వతపు సతీష్ కుమార్, బాపట్ల మురళీ, చింతా నాగరాజు, తోట మల్లేశ్వరరావు, బాలినేని నాగేశ్వర రావు, పత్తిపాటి శ్రీనివాసరావు, సమ్మెట అప్పారావు, పూసల కొండలరావు, సాంబశివరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, అడపా శ్రీనివాసరావు, ధర్మపురి రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను కాపాడుకుందాం..

కొత్తగూడెంఅర్బన్: విద్యా వ్యవస్థను కాపాడితే భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుందని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎస్.సుందర్‌రాజుయాదవ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని శ్రీకృష్ణ ఇన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు అనేక సమస్యలతో ఉన్నారని, వారు బావుంటేనే విద్యార్థులకు మంచి బోధన చేస్తారని, వారు ఆందోళనలో ఉంటే బోధనలు చేయడం సాధ్యం కాదని, వారి సమస్యలను దూరం చేయడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క అవకాశం కల్పించి శాసనమండలిలో ప్రశ్నించే విధంగా చేయాలని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో వేల్పుల కుమార్, దామోదర్, వేణుగోపాల్, బసనబోయిన వెంకటేశ్వర్లు, భిక్షపతి, వీరస్వామి, శంకర్‌రావు, సంపత్, శరత్, రణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి..

పాల్వంచరూరల్: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు పట్టణంలో పలు పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం జరగాలంటే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పానిశెట్టి వెంకటేశ్వర్లు, గంధం ప్రసాద్‌గౌడ్, లక్ష్మణ్, నరేష్, వినయ్, రాంబాబు, అశోక్, నరేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రదర్శన




బాలమేళా కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

టేకులపల్లి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రదర్శన బాలమేళా కార్యక్రమం శుక్రవారం టేకులపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్ నాయక్ బాలమేళాను ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శనలను అభినందించారు. టేకులపల్లి కాంప్లెక్స్ పరిధిలోని 12 ప్రాథమిక పాఠశాలలు పాల్గొన్నాయి. విద్య, పర్యావరణ పరిరక్షణ, మొక్కల ఆవశ్యకత అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్‌లు, నృత్యాలు, పాటలు అలరించాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సహాయ కార్యదర్శి బానోత్ లక్ష్మా, హెచ్‌ఎంలు సుజాత, వెంకట్రావ్, వెంకయ్య, ఆర్‌పీ జి.నరేష్, సీఆర్‌పీ నాగేశ్వర్‌రావు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు వీరన్న, మంగీలాల్, హతీరాం, భారతి, స్వరూప, రాణి, రాంబాబు, బలరాం పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి రేపు పరీక్ష

ఇల్లెందురూరల్/పాల్వంచరూరల్: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతితో పాటు 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాల, పాల్వంచలోని జీసీసీ కార్యాలయం పక్కన ఉన్న బాలికల గురుకులం, కిన్నెరసాని డ్యామ్‌సైట్‌లోని గిరిజన గురుకుల పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాళ్లు రత్నకుమారి, స్వరూపరాణి, ఎస్.శ్యాంకుమార్ వెల్లడించారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో ఉదయం 10గంటలకల్లా నిర్దేశిత కేంద్రాలకు చేరుకోవాలని వారు సూచించారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుకు స్పందన



కుంటను శుభ్రం చేస్తున్న దోజర్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 6, 12వ వార్డుల మధ్య సుమారు 20 ఎకరాల భూమి అపరిశుభ్రంగా మారి, చెట్లపొదలు విపరీతంగా పెరిగాయి. ఇవి పందులకు, విషపు కీటకాలు, పాములు, ఇతర జంతుజాలాలకు నిలయం మారింది. దీనిని శుభ్రం చేయాలని ప్రజలు ఈనెల 3న కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేశారు. స్పందించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు. దీంతో కమిషనర్ దోజర్‌తో శుభ్రం చేయించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాల్వంచరూరల్: ఇసుక అక్రమ రవాణాను శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి తోగ్గూడెం గ్రామ సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం ఎస్ఐ సురేష్ పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ రంగారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 21న మహారాష్ట్రలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ 68వ నేషనల్ గేమ్స్‌లో సాఫ్ట్ బాల్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అభినందించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు శుక్రవారం కలెక్టర్‌తోపాటు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డిని కలిశారు. కొత్తగూడేనికి చెందిన జయశ్రీ, రుద్రంపూర్ లక్ష్మీదేవిపల్లి తండాకు చెందిన నిఖిత, అన్నపురెడ్డిపల్లికి చెందిన భార్గవ్, వెంకటేశ్ పోటీల్లో ప్రతిభ చూపగా, కలెక్టర్ అభినందించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు సందర్శన



కార్యదర్శితో మాట్లాడుతున్న విద్యార్థులు

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి సబ్ యార్డులో ఏర్పాటు చేసిన మిర్చి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మొదటి రోజు రూ.13,300 తేజ మిర్చి క్వింటా ధర పలకగా రెండో రోజు ఖమ్మం, వరంగల్ మార్కెట్ల కన్నా అధికంగా రూ.14,300 ధర పలికింది. తాజాగా శుక్రవారం రూ.14,050 ధర వచ్చింది. దీంతో టేకులపల్లి సబ్ యార్డులో జరుగుతున్న కొనుగోళ్లు, నాణ్యమైన మిర్చి, మెరుగైన ధరల గురించి రాష్ట్రం నలుమూలల్లో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థులు కిరణ్మయి, కళ్యాణ్‌లు శుక్రవారం టేకులపల్లి సబ్ యార్డును సందర్శించారు. పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రాజెక్టు వర్క్ కోసం వచ్చిన వారు రైతులతో మమేకమయ్యారు. రైతులు పండించే పంటలు, దిగుబడి, ధరలు, ఆర్థికాభివృద్ధి తదితర వివరాలు తెలుసుకున్నారు. కార్యదర్శితో మాట్లాడి కొనుగోళ్లు, మద్దతు ధర తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్3 కార్యదర్శి ఇ.నరేష్‌కుమార్, సూపర్‌వైజర్ వి.శ్రీనివాస్‌రావు, ఏఎంసీ సిబ్బంది జి.రంజిత్, సీహెచ్ లక్ష్మయ్య, కార్తీక్, మునీర్, శ్రీనివాస్‌రావు, మోహన్‌రావు, హరికృష్ణ, మధు, ట్రేడర్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్నిరకాల వైద్యశాలల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లందరూ తమ పరిధిలోని వైద్యశాలలకు సమయానికి వచ్చి విధులు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. జిల్లాలోని వైద్యశాఖల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌లతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆస్పత్రి ఎస్ఓఈలను సమయానికి వైద్య ఆరోగ్య శాఖకు అందించాలని, హాజరు శాతం పాటించాలని, ఉద్యోగుల ఆస్పత్రి ఖర్చులను, బిల్స్‌తో సహా జత చేసి వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ గుగులోతు సింగోజీ, సుదర్శన్, రతన్‌రాజ్ పాల్గొన్నారు.

బొగ్గు పుట్టినింటిని కాపాడండి..



మాట్లాడుతున్న రంగనాథ్

ఇల్లెందు: బొగ్గు బావులకు పుట్టినిల్లును సింగరేణిలో గుర్తింపు సంఘాలు, ప్రాతినిధ్య యూనియన్లు, అధికార పార్టీ నేతలు, ఇతర సంఘాలతో కలిసి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.రంగనాథ్, వైస్ ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన టీబీజీకేఎస్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో 21 ఇంక్లైన్ మైన్ మూత పడుతుందని ముందస్తుగా అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో స్వయంగా ఆనాటి సీఎం దృష్టికి తీసుకెళ్లి మూడేళ్లు కార్మికుల ప్రయోజనాల కోసం బావిని నడిపించినట్లు తెలిపారు. ప్రస్తుతం మార్చి 31తో జేకే ఓసీ మూత పడుతుందని తెలిసి అధికార పార్టీ, దాని అనుబంధ సంఘం, గుర్తింపు సంఘం సమష్టిగా కృషి చేయాలని కోరారు. పూసపల్లి ఓసీ పూర్తి స్థాయి అనుమతులు రానందున ఇక్కడి ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తారని ప్రచారం సాగుతుండటంతో కార్మికుల్లో ఆందోళన మొదలైందన్నారు. తక్షణం ఇల్లెందు పురిటి గడ్డను కాపాడాలని అందుకు అన్ని సంఘాలను కలుపుకుని ప్రయత్నం ముమ్మరం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మినహాయించాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పీఎంశ్రీ పథకం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను మినహాయించాలని, ప్రీప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలలోనే నిర్వహించాలని, ఐసీడీఎస్‌ను బలహీనపరిచే నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్, డీడబ్ల్యూఓలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ మాట్లాడుతూ... రూ.కోట్లు ఖర్చు పెట్టి పీఎంశ్రీ సెంటర్లను ప్రారంభించడం కంటే అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పీఎంశ్రీ పథకానికి ప్రత్యేక సిబ్బందిని నియమించని అంగన్‌వాడీ టీచర్లను వెల్‌ఫర్సన్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. గ్రాట్యూటీ చట్టం ప్రకారం రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, ఈ.వెంకటమ్మ, రాధాకుమారి, కళావతి, ఫాతిమా, కృష్ణవేణి, అచ్చమ్మ, కృష్ణకుమారి, కమల, మనోహరి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ విచారణ జరిపించండి..

టేకులపల్లి: మేడిగడ్డ నిర్మాణంలో అవినీతిలో ప్రశ్నించినందుకే నాగవెల్లి రాజాలింగమూర్తి హత్య జరిగిందని తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రశాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, అటవీ భూముల పరిరక్షణకు ఆయన పోరాడుతుండగా 18 కేసులతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేశారన్నారు. అంతేకాక కోర్టులో వేసిన కేసు వెనక్కి తీసుకోవాలని ప్రలోభాలకు గురిచేసినా వినకపోవడంతో నడిరోడ్డుపై ప్రాణం తీశారని ఆరోపించారు. ఈఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రశాంత్ కోరారు.

మాతృభాష గొప్పతనం మాటల్లో చెప్పలేనిది..

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కవులు, వీరులు, వీరవనితలు, ఉద్యమకారుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. తెలుగుభాష గొప్పతనాన్ని చాటి చెబుతూ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. వక్తలు మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో ప్రతీఒక్కరు మాతృభాష పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. ఆలోచన, విశ్లేషణ, భావోద్వేగ ప్రకటన, నవ్వు, దుఃఖం మాతృభాష నుంచే ఇతర భాషల్లోకి పరివర్తన చెందుతాయని చెప్పారు. భారతదేశ ఉన్నతమైన సాంస్కృతిక, భాషా వారసత్వాన్ని మనం అందరం కాపాడుకోవాలని పేర్కొన్నారు. మాతృభాష గొప్పతనం మాటల్లో చెప్పలేనిదని, మాతృభాషలో మాట్లాడడం అంటే మన ఆచారాలు, సంప్రదాయాలు కొనసాగించడమే అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో...



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ



సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రసేన్‌ను సన్మానిస్తున్న దృశ్యం



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న శ్రీ రామచంద్ర ప్రభుత్వ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు